శాంతియుతంగా శోభాయాత్ర నిర్వహించుకోవాలి

ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, పోలీస్ అధికారులు

చిలకలగూడ: మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా గణనాథుని శోభయాత్ర నిర్వహించుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి సూచించారు. చిలకలగూడ మున్సిపల్ మైదానంలో అకీషా ఫౌండేషన్ ఛైర్మన్ బండపల్లి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గణనాథుని శోభయాత్ర, నిమజ్జనం కార్యక్రమంల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈనెల 17వ తేది మంగళవారం ఉదయం నుంచే శోభయాత్ర కొనసాగేలా చర్యలు చేపట్టాలని మండప నిర్వాహకులకు సూచించారు. గణనాథుని నిమజ్జనానికి చిలకలగూడ మైదానంతోపాటు ఈస్ట్‌జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక నీటి కొలనులను వినియోగించుకోవాలని కోరారు. డిప్యూటీ డీసీపీ నరసయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, అకీషా ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తా


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న విజయ్‌సింగ్ తదితరులు

సనత్‌నగర్: రవీంద్రనగర్ కాలనీ అభివృద్ధికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీనిచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సనత్‌నగర్ డివిజన్‌లోని రవీంద్రనగర్ కాలనీ కమిటీ సభ్యులు శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగాలిసి పూమాలలు, శాలువాతో సత్కరించారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నూతన కమిటీ అధ్యక్షుడు విజయ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు సుదర్శన్, మాథ్యూర్, కోశాధికారి రాంరెడ్డి, కాలనీవాసులు సత్యనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల హౌస్ అరెస్ట్


మారేడుపల్లిలోని తన నివాసంలో బీఆర్‌ఎస్ నేతలతో సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్


బోయిన్‌పల్లిలో గృహ నిర్బంధంలో ఉన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి


తుకారాంగేట్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్ ఇంటి వద్ద పోలీసులు

కంటోన్మెంట్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికపూడి గాంధీల మధ్య సాగుతున్న వాగ్వాదం, పరస్పర సవాళ్లు, దాడుల నేపథ్యంలో శుక్రవారం పోలీసులు బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టులు చేపట్టారు. కంటోన్మెంట్ పరిధిలోని బోయిన్‌పల్లిలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మారేడుపల్లిలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్‌లను ఉదయం నుంచే గృహ నిర్బంధంలో ఉంచారు. తాను ఆసుపత్రికి వెళ్లాల్సి ఉందని చెప్పినప్పటికీ మారేడుపల్లి పోలీసులు తలసానిని బయటకు వెళ్లనివ్వలేదు. ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు నిర్బంధంలో ఉంచారు. సాయంత్రం మాజీ మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్‌ను వాహినీ నగర్లోని తన నివాసంలో నిర్బంధించారు.

భయాందోళనకు గురిచేస్తున్నారు : మల్లారెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలన రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను భయాందోళనలకు గురి చేస్తుందని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. తనతో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గృహ నిర్బంధంలో ఉంచడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కౌశిక్ రెడ్డి, గాంధీల మధ్య తలెత్తిన వివాదాన్ని శాంతిభద్రతల సమస్యగా మార్చారని విమర్శించారు. ఓ పక్క కౌశిక్ రెడ్డిని హౌజ్ అరెస్టు చేసి, గాంధీ వందలాది మందితో కౌశిక్ రెడ్డికి ఇంటిపైకి దాడికి వెళ్లినా అడ్డుకోలేదన్నారు.

ఎమ్మెల్యేలను అడ్డుకోవడం అప్రజాస్వామికం: మర్రి

ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య తలెత్తిన గొడవను కంట్రోల్ చేసే క్రమంలో, నగర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను హౌజ్ అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి, భద్రతలను కాపాడటంలో విఫలం అవుతోంది అన్నారు.


మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

కంటోన్మెంట్ ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్

అడ్డగుట్ట: తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నేతృత్వంలో శుక్రవారం ఉదయం పలువురు పోలీసులు తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే శ్రీగణేష్ నివాసానికి చేరుకొని ఆయనను గృహ నిర్బంధం చేసి ప్రొటెక్షన్ కల్పించారు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: సంజీవయ్యపార్కు, హెచ్‌పీఎస్, బేగంపేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్‌వర్క్స్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, ప్రకాష్‌నగర్, ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు గురుమూర్తిలేన్, తాతాచారికాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, బొంబే హల్వా కాంపౌండ్, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్‌ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్ లేన్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, చైతన్య జూనియర్ కాలేజ్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలోల్లో.. టమాటా రూ.27, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 45, బెండకాయ 55, పచ్చిమిర్చి 18, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరిబీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 50, దొండ 45, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 90, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 19, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 39, చామగడ్డ 45, మొరంగడ్డ 65, కందగడ్డ 65, సొరకాయ 23, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 5-6, ముల్లంగి 5-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఔట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా


ఈఎస్‌ఐ డైరెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఈఎస్ఐ డైరెక్టరేట్ కార్యాలయం ముందు శుక్రవారం ఔట్ సోర్సింగ్ కార్మికులు ధర్నా చేశారు. పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి ఔట్ సోర్సింగ్ మహిళా సిబ్బంది బీమా వైద్య సేవల(ఈఎస్ఐ)డైరెక్టరేట్ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. నెలల తరబడి నుంచి జీతాలు ఇవ్వకుంటే బతికేది ఎలా అంటూ ప్రశ్నించారు. ప్రతి నెలా 5వ తేదీ జీతాలు ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ విధానాన్ని తొలగించి తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం హైద్రాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. గౌతమ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

దేశ రాజకీయాల్లో ఏచూరిది చెరగని ముద్ర


తార్నాకలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ నేతలు


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థి నేతలు

లాలాపేట: సాధారణ కార్యకర్త నుంచి అంచలంచెలుగా ఎదిగి భారతదేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి చెరగని ముద్ర వేసుకున్నారని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తార్నాక చౌరస్తాలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి మరణం దేశంలో వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటన్నారు. దేశంలోని బిజేపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేఖంగా ఉద్యమించడమే సీతారం ఏచూరికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: సీపీఎం జాతీయ నాయకులు సీతారాం ఏచూరి మరణం రైతు, కార్మిక, అణగారిన వర్గాల ప్రజలకు తీరని లోటు అని కంగ్రెస్ సీనియర్ నాయకులు సుల్తాన్ యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అడ్డగుట్టలో ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నవాళులర్పించారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ విద్యార్థి సంఘాల నేతలు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి నివాళ్లు అర్పించారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు ఏచూరి చిత్రపటానికి పూలను వేస్తు జోహార్లు అర్పించి ఆయన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, ఓయూ నేత రవినాయక్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోట శ్రీనివాస్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ తదిరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే తలసాని


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

పద్మారావునగర్: పేద విద్యార్థుల విద్యావికాసానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పాఠశాలలో సౌకర్యాలు, సదుపాయాలు మెరుగు పర్చడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ మేకలమండి ప్రభుత్వ పాఠశాల నూతన కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టులు నిస్వార్థంగా ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని పాఠశాల అభివృద్ధి, అక్కడ విద్యార్థుల విద్యావికాసానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఇ. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బి. నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు ఆర్. రాజు, కోశాధికారి వీజే శేషగిరిరావు, కార్యదర్శి కె. మల్లికార్జున్‌రెడ్డి, డి. భరత్‌భూషణ్, గోపీక్రిష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


హిందీ దివస్ కార్యక్రమంలో డాక్టర్ దత్తా సాకోలే తదితరులు

సనత్‌నగర్: జాతీయ అధికారిక భాష హిందీ అభివృద్ధికి కృషిచేయాలని ఎస్ఎండీ మొహేకర్ విద్యాలయం హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దత్తా సాకోలే అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీత కళాశాలలో హిందీ దివస్ వేడుకలను ప్రిన్సిపాల్ కే పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందీ విభాగ అధ్యక్షులు డాక్టర్ ఎం.మధుకర్‌రావు, అఫ్సరున్నీసాబేగం, డాక్టర్ మృదుల, నందినీ, సునీత, పద్మాకుమారి, వెంకటేశ్వరు పాల్గొన్నారు.

గృహ నిర్బంధంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా పరిధిలోని ఇరువురు బీఆర్‌ఎస్ కార్పోరేటర్లను శుక్రవారం ఉదయం నుంచి గృహనిర్బంధంలో ఉంచారు. మాజీ మంత్రి హరీష్‌రావు అరెస్ట్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఇంట్లో బీఆర్‌ఎస్ సమావేశానికి పిలుపు నేపద్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సీతాఫల్‌మండి, మెట్టుగూడ కార్పోరేటర్లు సామల హేమ, రాసూరి సునీతలకు గృహ నిర్బంధం విధించారు.

అడ్డగుట్ట/బౌద్ధనగర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, అతని అనుచరులు దాడి చేయడం అప్రజాస్వామికమని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి అన్నారు. శేరిలింగంపల్లి మీటింగ్ నేపథ్యంలో ముందస్తుగా తుకారాంగేట్ పోలీసులు ఆమెను శుక్రవారం ఉదయం హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే వారాసిగూడ పోలీసులు కార్పొరేటర్ కంది శైలజను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు.

శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

అడ్డగుట్ట: పండుగలను భక్తి శ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి సూచించారు. మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకొని శుక్రవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముస్లిం మతపెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా నిమజ్జనాల సమయంలోనే మిలాద్ ఉన్ నబీ రావడంతో ప్రజలందరూ కులమత బేదాలు లేకుండా సమన్వయంతో వేడుకలు జరుపుకోవాలన్నారు. గణపతి నిమజ్జనం సందర్భంగా మిలాద్‌ఉన్ నబీ వేడుకలను సెప్టెంబర్ 19వ తేదీకి మత పెద్దలు వాయిదా వేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎస్ఐలు నాగరాజ్ యాదవ్, షాహీద్ పాషా, అమర్ సింగ్, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో బాలికలకు రక్త పరీక్షలు



అడ్డగుట్ట: జాతీయ పోషణ మహోత్సవంలో భాగంగా సికింద్రాబాద్ ప్రాజెక్ట్ అడ్డగుట్ట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్త హీనతతో బాధపడుతున్న బాలికలకు శుక్రవారం అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేశారు. రక్త హీనత సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వవరించారు. అనంతరం, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లు అనిత, శోభారాణి, రేణుక, పద్మ, పద్మావతి, స్వరూప పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

సనత్‌నగర్: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడడంలో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ సూచించారు. బేగంపేట పాటిగడ్డలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ప్రజాపాలన సర్వీస్ క్యాంప్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి కోట నీలిమ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తూ ముందుకుసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు విశాల్ సూదం, షేక్‌గౌస్, చీరంజీవి, కృష్ణ, నజీర్, అభిషేక్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులోని అవినాష్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడబుతూ ఈ సంవత్సరం 155 మంది లైసెన్సు లేని వారికి 100 మంది ట్రిపుల్ రైడింగ్ చేసిన వారికి తమ ఇన్‌స్టిట్యూట్‌లో ట్రెనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని రహదారులపై నిబంధనలు పాటించడం ద్వారా వాటిని నివారించవచ్చని అన్నారు.

ఉపసంఘంపై మాల మహానాడు అసంతృప్తి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ వర్గీకరణపై మంత్రి వర్గ ఉప సంఘం సభ్యుల నియామకం పట్ల తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హుస్సేన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉప సంఘంలోని ఆరుగురు సభ్యులు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించే వారని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. సుప్రీమ్ కోర్టు సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఎస్సీ, ఎస్టీ వర్గాలలో వివరాలను సేకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకోవాలన్నారు.

బంగారు ఆభరణాల పేరిట మోసం


నిందితుడు శివకుమార్

చిలకలగూడ: విభిన్నమైన డిజైన్లలో అతి తక్కువ ధరలకు బంగారు ఆభరణాలు తయారుచేసి ఇస్తానని నమ్మించి, డబ్బులు తీసుకుని మోసం చేస్తున్న గోల్డ్‌స్మిత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, డీఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకుమార్ సోనకార్(37) నగరానికి వలసవచ్చి ఓగోల్డ్‌షాప్‌లో పనిచేసేవాడు. చిలకలగూడ ప్రధాన రహదారిలో మూడేళ్ల క్రితం ఉదయ్‌బన్ జ్యూవెలరీ పేరిట బంగారు ఆభరణాల దుకాణం ఏర్పాటు చేశాడు. షాప్‌కు వచ్చే కస్టమర్లను తక్కువ ధరలకు అద్భుతమైన డిజైన్లతో బంగారు ఆభరణాలు తయారు చేస్తానని మాయమాటలతో నమ్మించి పలువురి నుంచి లక్షలాది రూపాయల వసూలు చేశాడు. రోజులు గడుస్తున్నా ఆభరణాలు ఇవ్వకపోవడంతో తమ డబ్బులైన తిరిగి ఇవ్వాలని బాధితులు ఒత్తిడి చేయడంతో తనకు కోట్లాది రూపాయలు రావాల్సి ఉందని, అవి రాగానే ఇచ్చేస్తానని నమ్మబలికాడు. మోసపోయామని గ్రహించిన పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. శివకుమార్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

30న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 30న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను నిర్వహించనున్నారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అక్టోబరు 12, 13 తేదీల నాటికి పీడీఎస్‌యూ పురుడుపోసుకొని 50 ఏండ్ల సందర్భంగా స్వర్ణోత్సవాల సభను ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరపనున్నట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: ఉపాధి కోసం నగరానికి వచ్చి అనారోగ్యం బారిన పడి తిరిగి సొంతూరుకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన కూలీ శుక్రవారం మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... బెంగాల్ రాష్ట్రానికి చెందిన సంజిత్‌దాస్ (26) ఉపాధి కోసం కొద్ది నెలల క్రితం నగరానికి వచ్చి ఒక భవననిర్మాణ సంస్థలో కూలీగా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా సంజిత్‌దాస్ అనారోగ్యం బారిన పడడంతో విశ్రాంతి కోసం తిరిగి సొంతగ్రామానికి పంపించేందుకు అతని సోదరులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు తీసుకువచ్చారు. రైలు రాకకోసం ఎదురుచూస్తున్న సమయంలోనే తీవ్ర అస్వస్థతకు గురైన సంజిత్‌దాస్ ప్లాట్‌ఫామ్‌పైనే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: అనారోగ్య సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. తుకారాంగేట్‌లోని బుద్ధానగర్ ప్రాంతానికి చెందిన గడ్డం అక్షయ్ కుమార్(29)వెహికల్ రికవరీ కలెక్షన్ చేస్తుంటాడు. అయితే, కొంత కాలంగా అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కుటుంబసభ్యులందరూ ఇంట్లో ఉండగా, పైఅంతస్తుకు వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఎంత సేపటికీ అక్షయ్ కిందికి రాకపోవడంతో అతని సోదరి పైకి వెళ్లి కిటికిలో నుంచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. వెంటనే తలుపులు బద్దలుగొట్టి అక్షయ్‌ను ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్మగ్లర్ రిమాండ్

సికింద్రాబాద్: గంజాయి అక్రమ రావాణా చేస్తున్న ఓ ఘరానా స్మగ్లర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్ఎన్.జావెద్ కథనం ప్రకారం... సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఇన్‌స్పెక్టర్ బి.సాయీశ్వర్‌గౌడ్ నేతృత్వంలో ఎస్ఐ డి.రమేష్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఒడిస్సా రాష్ట్రం గంజామ్ జిల్లాకు చెందిన సుదర్శన్‌నాయక్ (54) అనుమానాస్పదంగా కనిపించాడు. అతని లగేజీ తనిఖీ చేయగా అందులోంచి రూ.4.61 లక్షల విలువ చేసే 18.5 కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ఒడిస్సా నుంచి సికింద్రాబాద్ మీదుగా గుజరాత్‌కు గంజాయి రవాణా తీసుకువెళ్లేందుకు వచ్చిన సుదర్శన్ నాయక్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసులు నమోదు చేసిన రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించి గంజాయి స్మగ్లర్‌ను పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్, ఎస్ఐ రమేశ్, కానిస్టేబుళ్లు ఖదీర్‌అహ్మద్, ఎం.శేఖర్, కే.చంద్రశేఖర్‌లను ఎస్పీ చందనాదీప్తి అభినందించారు.


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న రైల్వే డీఎస్‌పీ జావెద్

వైభవంగా నవరాత్రులు

వాడవాడలా గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఒకవైపు డప్పు వాయిద్యాలు, యువత కేరింతల నడుమ నిమజ్జన ఊరేగింపు...మరోవైపు లడ్డూ వేలంపాటలు....ఇంకోవైపు అన్నదాన కార్యక్రమాలతో వినాయక మండపాల వద్ద కోలహలం నెలకొంది. – సనత్‌నగర్




బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో.. మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి..


మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో.. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ


శ్రీనివాస్ నగర్‌లో లడ్డూ దక్కించుకున్న అరవింద్


వినాయక మండపంలో గాంధీ మాజీ సూపరింటెండెంట్ ధైర్యవాన్


సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి


గణనాథుడికి వీడ్కోలు పలుకుతున్న చిన్నారులు


అడ్డగుట్టలో గణనాథున్ని దర్శించుకున్న సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం చైర్మన్ సంతోష్ యాదవ్